www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
సోమవారం
02 జూన్ 2025

## విలేఖరులు కావలెను

కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003

# ముక్కలేనిదే ముద్ద దిగట్లే!

నేషనల్ శాంపిల్ సర్వేలో వెల్లడి
ఉత్పత్తి, వినియోగంలోనూ మన రాష్ట్రమే
ఒక్కో వ్యక్తి సగటున 23.97 కిలోల మాంసం

**మాంసాహారం వినియోగంలో దేశంలోనే తెలంగాణ టాప్**

కలంజ్యోతి ప్రతినిధి : మాంసం వినియోగం, ఉత్పత్తిలో మన రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. సందర్భం ఏదైనా.. దసరా, బక్రీద్, బోనాలు, వనభోజనాలు.. పండుగ ఏదైనా ముక్క లేనిదే ముద్ద దిగడం లేదు. ఏ చిన్న ఫంక్షన్ జరిగినా అక్కడ మాంసాహారం తప్పనిసరైంది. ఫలితంగా మాంసం వినియోగంలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. దేశవ్యాప్తంగా మాంసాహారులు 61.86 శాతం మంది ఉంటే రాష్ట్రంలో ఏకంగా 98.73 శాతం మంది ఉన్నట్లు తేలింది. దేశంలో తినే మాంసంలో 60 శాతం తెలుగు రాష్ట్రాల ప్రజలు ఉన్నారని జాతీయ మాంస పరిశోధన సంస్థ (ఎన్ఆర్‌సీఎం), నేషనల్ శాంపిల్ సర్వే గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వాస్తవానికి ఒక్కో వ్యక్తి ఏడాదికి 12 కిలోల మాంసాన్ని తినాలని జాతీయ పౌష్టికాహార సంస్థ (ఎన్ఐఎన్) సూచిస్తున్నది. జాతీయ స్థాయిలో తలసరి వినియోగం 2.900 కిలోల నుంచి 3,260 కిలోల వరకు ఉంటుంది. తెలంగాణలో మాత్రం సగటున ఏడాదికి 23.97 కిలోల మాంసాన్ని తింటున్నారని సర్వేలో తేలింది. మాంసం తినడంలో తెలంగాణ టాప్‌లో ఉండగా, తర్వాత స్థానంలో ఏపీ ఉంది. ఈ స్థాయిలో ఏ రాష్ట్రంలో కూడా మాంసం తినేవాళ్లు లేరని ఈ లెక్కలు చెబుతున్నాయి. తాజాగా ఈ లెక్కలు రాష్ట్ర ప్రజలను మరోసారి షాక్ లో పడేస్తున్నాయి. ఎందుకంటే ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం మద్యం విక్రయాలలో నెంబర్ వన్ అనుకుంటే... ఇప్పుడు మాంసం తినే వారిలో కూడా మొదటి స్థానానికి వచ్చింది. అయితే ఈ ఏడాది జనవరిలో కూడా మాంసం వినియోగం, ఉత్పత్తిపై నేషనల్ శాంపిల్ సర్వే, మీట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లెక్కలు విడుదల చేసింది. అప్పటి సర్వే ప్రకారం.. భారత్ లో మాంసాహారాన్ని ఎక్కువగా తింటున్న రాష్ట్రాల్లో నాగాలాండ్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ ప్రాంతంలో 99.8% మంది ప్రజలు నాన్ వెజ్ తింటున్నారట. తర్వాతి స్థానంలో 99.3 శాతంతో పశ్చిమ బెంగాల్ ఉంది. మూడో స్థానంలో 99.1 శాతంతో కేరళ ఉండగా.. 98.25 శాతంతో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో నిలిచింది. తర్వాత తమిళనాడు 97.65శాతం ఉండగా, ఒడిశా 97.35, తెలంగాణ 97.3తో 7 స్థానంలో నిలిచింది. ఎనిమిదో స్థానంలో 97 శాతంలో జార్ఖండ్, త్రిపుర 95, గోవా 93.8తో చివరి స్థానంలో ఉంది. కానీ, నాలుగు నెలల్లోనే మన రాష్ట్రం నెంబర్ వన్ స్థాయికి వచ్చింది. ఈ లెక్కన మాంసం వినియోగం ఎంత మేరకు పెరిగిందో అర్థమవుతుంది.



## మటన్‌కు భారీ డిమాండ్..

రాష్ట్రంలో 2012లో గొర్రెలు కోటి 28 లక్షల వరకు ఉండగా... ప్రస్తుతం2.11 కోట్లకు పెరిగినట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ చేపట్టిన పశుగణనలో వెల్లడైంది. అయినా రోజుకు 6 వేల గొర్రెలు దిగుమతి అవుతూనే ఉన్నాయి. గొర్రెల మాంసానికి గిరాకీ ఎక్కువగా ఉండటంతో ఏటా మటన్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో గొర్రె మాంసమే ఎక్కువగా తింటున్నట్లు తేలింది. హైదరాబాద్‌లో దసరా, బక్రీద్ పండుగలకు 30 వేల చొప్పున యాటలు తెగుతయి. యావరేజ్‌గా ఈ రెండు రోజుల్లోనే 400 టన్నుల మాంసం అమ్మకాలు జరుగుతాయని ఎన్ఆర్‌సీఎం గణాంకాలు చెబుతున్నాయి. ఇక, ప్రపంచ వ్యాప్తంగా మాంసం వినియోగంలో ఇండియా వెనకబడింది. 2.9 కిలోల తసరి వినియోగంతో 42వ స్థానంలో ఉంది. 95.43 కిలోల తలసరి వినియోగంతో అమెరికా మొదటి స్థానంలో నిలవగా.. బ్రెజిల్, రష్యా, చైనా, సౌతాఫ్రికా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.





# కవి వెంకటేట్ కు సాహితీ సన్మానం

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ కు చెందిన పద్యకవి, వ్యాఖ్యాత, సంస్కృతభాషా ప్రచార సమితి ఆదిలాబాద్-నిజామాబాదు ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు డా బి.వెంకట్ సిందూరం రాష్ట్ర కవితా గాన సాహితీ సన్మానాన్ని ఆదివారం అందుకున్నారు. హైదరాబాదు కూకట్ పల్లి భారత్ వికాస్ పరిషత్ హాల్లో జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఆచార్య ముదిగొండ శివప్రసాద్ రచించిన సిందూరం గ్రంథావిష్కరణ, సిందూరం కవిసమ్మేళనంలో ఈ పురస్కారం పొందారు. ఆచార్య ముదిగొండ శివప్రసాద్, జాగృతి సంపాదకులు గోపరాజు నారాయణరావు, సాధన సాహితీ స్రవంతి అధ్యక్షులు సాధన నరసింహాచార్య, భారతీయం ఆర్షధర్మ ప్రముఖురాలు జి సత్యవాణి, వివేకానంద సేవా సమితి చైర్మన్ సి.హెచ్ విద్యాసాగర్ రావు, నావికాదళాధిపతి సి ఆర్ ఆచార్యులు, బిజేపి ప్రాంతం అధ్యక్షులు, ప్రచారకులు భాస్కర యోగి, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు వడ్లూరి ఆంజనేయులు, కవి మావుడూరి సూర్యనారాయణ మూర్తి, కార్యదర్శి శివరామకృష్ణ చేతులమీదుగా సిందూరం సాహితీ సన్మానాన్ని అందుకున్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి**



**కలంజ్యోతి, నర్సాపూర్ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ పార్టీ అధ్యక్షులు కేసిఆర్ ఆదేశాల మేరకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి టిఆర్ఎస్ పార్టీ నాయకులకు ప్రజా ప్రతినిధులు పార్టీ కార్యకర్తలు అందరూ హాజరై రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## స్వగ్రామం చేరిన వాసుగౌడ్ మృతదేహం



**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన పంజాల వాసుగౌడ్ (40) మృతదేహం ఆదివారం ఇంటికి చేరింది. కంపెనీ వీసా లేకుండా దుబాయ్ వెళ్లిన మృతుడు ఈ ఏడాది ఫిబ్రవరి 21 న అక్కడ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే మృతుడు అక్రమ నివాసం ఉంటుండడంతో రెండు నెలల వరకు వివరాలు లభించలేదు. తర్వాత మృతుడి వేలు ముద్రల ఆధారంగా ఇండియా లోని తెలంగాణ వ్యక్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నెల రోజుల అనంతరం తెలంగాణ ప్రభుత్వం చొరవతో గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి బృందం మృతదేహం చేరుకోవడానికి కృషి చేసినట్లు స్థానికులు తెలిపారు.



# ఆరోగ్య భీమా తీసుకోవాలి

**టాటా కంపెనీ సీనియర్ మేనేజర్ మూరావత్**

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** ప్రతి ఒక్కరూ ఆరోగ్య భీమా తీసుకోవాలని టాటా కంపెనీ సీనియర్ మేనేజర్ మూరావత్ అన్నారు. మండలంలోని అక్కల్ చెడ గ్రామానికి చెందిన ముత్యం రాజు ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రాజు గతంలో ఆరోగ్య భీమా చేయించుకున్నాడు. ఈ క్రమంలో చికిత్స కు అయినా ఖర్చు మొత్తం రూ.2.97,969లను టాటా ఆరోగ్య భీమా ప్రతినిధులు బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా మూరావత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య భీమా తీసుకోవడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా.. కంపెనీ నుంచి ప్రీమియం వస్తుందని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే పాలసీ తీసుకోవాలని సూచించారు. దీని వల్ల ఏదైనా ప్రమాదకరమైన పరిస్థితులలో ఆర్థికపరమైన భారం ఆ కటుంబంపై పడకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నర్సంపేట టాటా ఆరోగ్య భీమా ఆఫీస్ ఇన్ చార్జి ములుక ఆయిలయ్య, టాటా కంపెనీ అడ్వైజర్లు తోట రాము, ననుమాస కర్ణాకర్, కుసుమ సందీప్, కాసర్ల నరేష్, ములుక రేవంత్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రైతులకు విత్తనాలు పంపిణీ

**మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

**కలంజ్యోతి, హైదరాబాద్ :** రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నేటి నుంచి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు 5 పంటల విత్తనాల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 11 వేల గ్రామాల్లో 40 వేల మందికి విత్తనాలు సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా విత్తనాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వివరించారు. పంపిణీలో రైతులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం జరగకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మరోవైపు రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఆ వర్సిటీ అధికారులు చెప్పారు. విత్తన స్వయం సమృద్ధి లక్ష్యంగా గ్రామాల్లో నాణ్యమైన విత్తన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ వర్షాకాలం నేపథ్యంలో వ్యవసాయ శాఖకు విత్తనాలను సబ్సిడీపై అందుబాటులో ఉంచేందుకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, నేషనల్ సీడ్ కార్పొరేషన్ లు సంయుక్తంగా ముందుకు వచ్చి ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 89,302 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను ఆగ్రో రైతు సేవ కేంద్రాలలోనూ, అలాగే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పంపిణీకి సిద్ధం చేశాయి. ఈ క్రమంలో ఇప్పటి వరకు 1,17,912 మంది రైతులు 56,262 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేశారు. ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా 33,040 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

## ఏర్నర్సుపల్లె కురుమ సంఘం కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్షుడిగా చుక్క రమేష్**

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని ఏర్నర్సుపల్లె కురుమ యాదవ సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చుక్క రమేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడు తొత్తుల్ల ఎల్లయ్య, క్యాషియర్ తొత్తుల్ల ఐలయ్య ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధి తనకృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# ప్రైవేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ దవాఖానా!




- అర్ధరాత్రి వచ్చినా అత్యవసర సేవలు
- వైద్యుల సేవలకు సహకరించాలి
- నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘు




**ప్రైవేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ దవాఖానాలో వైద్యసాయం అందిస్తున్నాం. అర్ధరాత్రి వచ్చినా, ఏక్షణమైనా అత్యవసర సేవలు క్షణాల్లో అందిస్తున్నాం. చికిత్స కోసం రోగులను తీసుకొచ్చే బంధువులు వైద్యులకు సహకరిస్తే మెరుగైన వైద్యం అందించేలా వైద్యబృందం కృషి చేస్తుందని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు అన్నారు. రోజురోజుకు పెరుగుతున్న రోగులకు వైద్యం అందిస్తూ ఆస్పత్రి తీరును మారుస్తూ ప్రజలకు మంచి వైద్యం అందించడంలో ఆస్పత్రిని తీర్చిదిద్దుతూన్న ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రచ్చ రఘుతో 'కలంజ్యోతి' ప్రతినిధి ప్రత్యేక ఇంటర్వ్యూ.**

**ప్రశ్న : బాధ్యతలు చేపట్టిన నాటికి నేటికి ఆసుపత్రి పనితీరు ఎలా ఉంది?**

**జవాబు :** నేను ఆసుపత్రిలో బాధ్యతలు చేపట్టింది 2022 జనవరి. అప్పుడు నిత్యం 150 మంది రోగులు వస్తూ ఉండేవారు. నెలలో 50 మందికి డెలివరీలు చేసేవారం. హాస్పటల్లో అప్పుడు అనేక విభాగాల్లో అందుబాటులో లేవు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో సాధారణ వైద్య సేవలతో పాటు ఆర్థోపెటిక్, పరిమాలయాలజీ డిపార్ట్మెంట్, డెర్మటాలజీ, సైకియాట్రిక్ విభాగాలు రోగులకు అందుబాటులోకి వచ్చాయి.

**ప్రశ్న : ప్రసూతి విభాగం పనితీరు ఎలా ఉంది?**

**జవాబు :** గతంలో ప్రతినెల 50 నుండి 100 డెలివరీలు అయ్యేవని కానీ నేడు ఆసుపత్రి స్థాయి పెరగడం సౌకర్యాలు కూడా మెరుగు కావడంతో ప్రతి నెల 400 నుండి 450 ప్రసవాలు అవుతున్నాయి.

**ప్రశ్న : 2022లో ఎంత మంది వైద్య సిబ్బంది పనిచేసేవారు? ప్రస్తుతం ఎంతమంది చేస్తున్నారు?**

**జవాబు :** గతంలో 34 మంది వైద్యులు, సిబ్బంది విధులు నిర్వహించే వారు. ప్రస్తుతం విధులలో 300 మంది పని చేస్తున్నారు.

**ప్రశ్న : ప్రజా ప్రతినిధుల సహకారం?**

**జవాబు :** ఆసుపత్రి స్థాయి పెంపులో రోగులకు సేవలు అందించే విషయంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నారు. వారు ప్రత్యేక దృష్టి సారించడం వల్ల అధునాతన పరికరాలు ఆసుపత్రి రోగులకు అందుబాటులోకి వచ్చాయి. ఎమ్మెల్యే డాక్టర్ కావడం వల్ల ఎప్పటికప్పుడూ వైద్యులతో ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై చర్చిస్తూ మెరుగైన సేవలు అందించే విధంగా వసతులు కల్పిస్తున్నారు. దీంతో గతంలో కన్నా ప్రస్తుతం రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది. సిబ్బంది వైద్యులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడూ రోగులకు అత్యవసర సేవలు అందిస్తున్నాం. ఆసుపత్రిలో లిక్విడ్ ఆక్సిజన్ సిటీ స్కాన్, రేడియాలజీ లేకపోయినా టెలి రేడియాలజీ ద్వారా వైద్యం అందిస్తున్నాం.

**ప్రశ్న : ఆసుపత్రిలో తాగునీటి సమస్య ఉందా?**

**జవాబు :** గతంలో తాగునీటి సమస్య నెలకొని ఉన్న విషయం ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా ఆయన దృష్టికి తీసుకువెళ్లాం.. స్వయంగా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి ప్రత్యేకంగా బోరు వేయించి రోగులకు తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఆస్పత్రిలో కూడా స్వచ్ఛంద సంస్థ సహకారంతో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించాం.

**ప్రశ్న : సమస్యల పరిష్కారంలో వ్యవహరించిన తీరు?**

**జవాబు :** గతంలో ఆసుపత్రిలో నెలకొని ఉన్న సమస్యలను ప్రణాళిక బద్ధంగా ఒక్కొక్కటిగా పరిష్కరించుకున్నాం. మరికొన్ని సమస్యలను పరిష్కరించే దిశలో నిరంతరం పనిచేస్తున్నాం. సేవలు అందించేందుకు ఔట్సోర్సింగ్ సిబ్బంది కాంట్రాక్టర్ రెన్యువల్ చేసుకోకుండా సర్వీస్ చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం నా దృష్టికి వస్తే కాంట్రాక్టర్ రద్దుచేసి కొత్త కాంట్రాక్టర్ ద్వారా ఔట్సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాను. గతంలో కాంట్రాక్టర్ కార్మికులకు పీఎఫ్, జీపీఎఫ్,ఈ ఎస్ఐలు కట్టకుండా వేతనాలు కూడా సరిగా ఇవ్వడం జరగలేదు. ప్రస్తుత కాంట్రాక్టర్ రూ.15000 జీతంతో సేవలు అందిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న కాంట్రాక్టర్ కోర్టులో కేసు వేసి 150 మంది సిబ్బందికి సంబంధించిన పారిశుద్ధ ఖాళీలను నియమించకుండా స్టే తీసుకున్నారు. ఆ సమస్క పరిష్కరించుని త్వరలోనే వాటిని కూడా భర్తీ చేస్తాం.

**ప్రశ్న :**
**మీపై వస్తున్న ఆరోపణలపై?**

**జవాబు : కొందరు అవాస్తవాలను వార్తలుగా రాస్తూ తనపై తప్పడు ఆరోపణలు చేస్తున్నారు. వాస్తవాలను కలెక్టర్, ప్రజాప్రతినిధులకు వివరించాను. మెరుగైన సేవలు అందించాలే తప్పా... అనవసరమైన విషయాలను పట్టించుకోవద్దని వారు సూచించారు.**

**ప్రశ్న : ఆరోగ్యశ్రీ కేసుల వివరాలు బకాయిల చెల్లింపులు ఎలా ఉన్నాయి?**

**జవాబు :** ఆరోగ్యశ్రీ కేసులు అన్నింటికీ సేవలందిస్తున్నాం. 300 కేసులకు పైగా రోగులకు సేవలు అందుతున్నాయి. ఇప్పటికీ రూ. 2.50 కోట్లు బకాయిలు ఉన్నాయి. డయాలసిస్ సేవలు గతంలో ఈ ప్రాంతంలోని డయాలసిస్ రోగులను దృష్టిలో ఉంచుకొని జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో ఐదు పడకలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం ప్రస్తుతం దానిని పదికలుగా మార్చి విశాలమైన వాతావరణం లో డయాలసిస్ రోగులకు అన్ని సౌకర్యాలతో సేవలు అందిస్తున్నాం.

**ప్రశ్న : టీ హబ్ పేషంట్లకు ఇబ్బందిగా ఉందని సమాచారం?**

**జవాబు :** మెడికల్ కళాశాల దగ్గరలో ఉన్నందువల్లే ఉయ్యాలవాడకు టీ హబ్ ను షిఫ్ట్ చేయడం జరిగింది. అక్కడికి షాంపిల్స్ తీసుకువెళ్లడానికి రిపోర్ట్ తీసుకోరావడానికి వాహనాన్ని ఏర్పాటు చేశాం.

**ప్రశ్న ఆస్పత్రిలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి?**

**జవాబు :** ఆస్పత్రిలో గర్భిణుల కోసం అత్యవసర సేవలలో కూడా స్కానింగ్ సెంటర్ ను ఏర్పాటు చేశాం. ఆస్పత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచేందుకు ఎప్పటికప్పుడూ డ్రమ్ముడు ఏర్పాటు చేసి పరిశుభ్రంగా ఉంచుతున్నాం. ఆపరేషన్ థియేటర్లో పైకప్పుకు నీరు రావడం వల్ల టీఎస్ ఎండీఎస్ నిధులతో మరమ్మతులు చేయించాం. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సామర్థ్యం సౌకర్యాలు లేకపోవడం వల్ల త్వరలో మెడికల్ కళాశాల బిల్డింగ్ కు బదిలీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**ప్రశ్న : రోగులకు అందుతున్న ప్రత్యేక సేవలు ఏమిటి?**

**జవాబు :** రోగులకు, సిబ్బందికి అనేక మెరుగైన వైద్య సేవలు సౌకర్యాలను జిల్లా ఆసుపత్రిలో కల్పిస్తున్నది. గర్భిణులను తీసుకువచ్చే ఆశా సిబ్బంది విశ్రాంతి కోసం ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేశాం. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు నేరుగా సేవల కోసం ఆర్టీసీ సెంటర్ను ప్రతిపాదన పంపి కేటాయించాం. త్వరలో పైలేటివ్ కేర్ 20 పడకల సామర్థ్యం పెంచే విధంగా కృషి చేస్తున్నాం. మంత్రి జూపల్లి కృష్ణారావు విడుదల చేసిన రూ.30 లక్షలతో డ్రైనేజీ వ్యవస్థను పరిష్కరించాం. గతంలో రాత్రికి రాత్రే ఆసుపత్రి చుట్టూ రోడ్డు వేయించాం.

**ప్రశ్న : సిబ్బంది తొలగించినట్లు తెలిసింది?**

**జవాబు :** కొంతమంది సెక్యూరిటీ, ఇతర సిబ్బందిపై ఆరోపణలు వచ్చాయి. వారి పనితీరు కూడా సరిగా లేదు. మా విచారణలో వారు రోగుల నుంచి డబ్బులు చేశారని, దురుసుగా ప్రవర్తించారని తేలడంతో తొలగించాం.

**ప్రశ్న : ఇటీవల ఒక వైద్యుడు రాజీనామా చేయడం పై?**

జవాబు : ఆ అంశానికి నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆ డాక్టర్ ఎప్పుడూ మందలించలేదు. ఆయన రాజీనామా లేఖను సమర్పించాదు. పై చదువుల కోసం ఒక మంచి ప్యాకేజీ ప్రైవేట్ హాస్పిటల్లో ఉందని వెళ్లినట్లు నా దృష్టికి వచ్చింది. డాక్టర్లు ఎవరైనా ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవలందిస్తూ.. ఇక్కడ ఎవరైనా నిర్లక్ష్యం చేసే సహించేది లేదు.



# రెస్ట్ అన్నదే ఉండట్లేదు !

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఇలియానా 'దేవదాసు' చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకున్న ఆమె టాలీవుడ్, బాలీవుడ్ స్టార్స్‌తో నటించి ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. ఇక కెరీర్ పీక్స్‌లో ఉండగానే.. పెళ్లి కాకముందే ప్రెగ్నెంట్ అయింది. బేబీ బంప్‌తో దర్శనమిచ్చి అందరికీ షాకిచ్చింది. తాజాగా, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో చిట్ చాట్ చేసింది. ఇందులో భాగంగా ఇండస్ట్రీకి రీఎంట్రీ ఇవ్వడంపై క్లారిటీ ఇచ్చింది. 'సినిమాలకు చాలా మిస్ అవుతున్నా. రైడ్ నాకు ప్రత్యేకమైన చిత్రం. నిజం చెప్పాలంటే 'రైడ్-2' స్టార్ట్ చేసినప్పుడు నన్ను టీమ్ నటించమని అడిగింది. కానీ నాకు బిడ్డ పుట్టడంతో నా ప్రాధాన్యతలు మారిపోయాయి. 'రైడ్-2' ప్రమోషన్స్‌లో వాణి కపూర్ ఎంతో యాక్టివ్‌గా పాల్గొన్నారు. ఆమె పాత్ర ప్రత్యేకతను తీసుకువచ్చే ఉంటుందని నమ్ముతున్నా. నేను సినిమా ఇండస్ట్రీకి త్వరలోనే వస్తాను అని చెప్పుకొచ్చింది. ఇక మాతృత్వపు అనుభూతి గురించి మాట్లాడుతూ.. 'నేను ఊహించిన దానికి చాలా భిన్నంగా ఉంది.. ఈ ఫేజ్ ఇలా ఉంటుందని అస్సలు అనుకోలేదు.. నేను ఊహించిన దానికి పూర్తి భిన్నంగా ఉంది.. ప్రతి రోజూ 24 గంటలు రెస్ట్ అన్నదే ఉండడం లేదు.. కానీ ఎంత కష్టంగా ఉన్నా కూడా నా బిడ్డ స్మైల్, స్పర్శతో అవన్నీ మాయం అవుతున్నాయి. మాతృత్వం అనేది గొప్ప ఫీలింగ్' అని రిప్లై ఇచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.